గోరఖ్‌పూర్ రైలులో తరలిస్తున్న బాలుర గుర్తింపు

■ **చైల్డ్‌లైన్‌కు 11 మంది చిన్నారుల అప్పగింత**

కాజీపేట, ఏప్రిల్ 4 : గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న 11 మంది బాలురను కాజీపేట జీఆర్పీ పోలీసులు గురువారం గుర్తించి చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. గోరఖ్‌పూర్-సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ రైలులో కొంతమంది వ్యక్తులు బాలురను తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చింది. దీంతో ఈ రైలులో బల్లార్షా నుంచి కాజీపేట వరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 12 నుంచి 16 ఏండ్ల మధ్య వయసున్న 11 మంది బాలురతో పాటు వారిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో హైదరాబాద్‌లో (బాల కార్మికులుగా) పని కల్పిస్తామని తల్లిదండ్రుల అనుమతితో చిన్నారులను తరలిస్తున్నట్లు రవాణాదారులు ఒప్పుకున్నట్లు వివరించారు. దీంతో చిన్నారులను చైల్డ్‌లైన్ అధికారులకు

బాలురు, ఐదుగురు రవాణాదారులతో సిబ్బంది

అప్పగించామన్నారు. కార్యక్రమంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు రామ్మూర్తి, సంజీవరావు, ఎస్సైలు దాస్, మోహినుద్దీన్ పాల్గొన్నారు.

ఈవీఎం మిషన్ల కేటాయింపు పూర్తి

■ **వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య**

కాశీబుగ్గ, ఏప్రిల్ 4: వరంగల్ జిల్లాలోని వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజక వర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానికి ఓటింగ్ మిషన్స్ (ఈవీఎం) కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య తెలిపారు. గురువారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎనుమాముల మార్కెట్‌లోని గోడౌన్ నెంబర్ 12ను జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి మొదటి ర్యాండమైజేషన్ చేశారు. ఈవీఎంలను బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపు కోసం మరింత ర్యాండమైజేషన్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ మొత్తం ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని

స్ట్రాంగ్‌రూమ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పాలకుర్తి ప్రసాద్‌రావు, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ రంజిత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్లూకోల్ట్స్ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి

సుబేదారి, ఏప్రిల్ 4 : బ్లూకోల్ట్స్ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. గురువారం హనుమకొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బ్లూకోల్ట్ సిబ్బంది, ఎస్సైలతో ఆయన సమీక్షించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులపై సీపీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి రిపోర్ట్‌ను స్టేషన్ అధికారికి అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సీఐలు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'మాదిగల ఎదుగుదలకు కడియం అడ్డంకి'

కాశీబుగ్గ, ఏప్రిల్ 4: మాదిగ సామాజిక వర్గాన్ని రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అడ్డుకున్నాడని బీజేపీ నాయకుడు ముడుసు నరసింహ ఆరోపించారు. బుధవారం 14వ డివిజన్ బాలాజీనగర్ జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పుట్టిన రోజు సందర్భంగా కొత్తకొండ రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ పార్టీ మారిన కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు శ్రీహరికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పత్రి సుభాష్, పస్తం సమ్మయ్య, ఈ కిషన్, భిక్షపతి కట్టర్, పిట్ట సరస్వతి, ఓర్సు దేవేందర్, చింతనిప్పుల సాంబయ్య, తరాల కుమార్, కుడురుపాక జయప్రకాశ్, పీ ప్రవీణ్, సారం రాజు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతకు రూ. 50 వేల జరిమానా

భీమదేవరపల్లి, ఏప్రిల్ 4: గుడుంబా కేసులో మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన వల్లెపు రజితకు తహసీల్దార్ ప్రవీణ్ రూ. 50 వేల జరిమానా విధించినట్లు కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ముల్కనూరులోని వడ్డెర కాలనీకి చెందిన రజిత గతంలో గుడుంబా కేసులో పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. తర్వాత మళ్లీ గుడుంబా అమ్ముతూ రజిత పట్టుబడినట్లు తెలిపారు. దీంతో ఆమెను పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు వెల్లడించారు. అనంతరం బ్రీచ్ కేస్ నమోదు చేసి తహసీల్దార్ ప్రవీణ్ ఎదుట హాజరుపరచగా రూ. 50వేలు జరిమానా విధించారని చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై మమత, సిబ్బంది ఖలీల్, కోటి పాల్గొన్నారు.

మే 14 నుంచి నాటక ప్రదర్శనలు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4: మే 14 నుంచి 16 వరకు వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రం నుంచి మూడు చొప్పున మొత్తం 6 నాటక ప్రదర్శనకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి నాటికకు రూ. 15 వేలు, పోటీల్లో గెలుపొందిన ఉత్తమ, ద్వితీయ నాటకాలకు రూ. 10 వేలు, రూ. 5 వేల పారితోషికం అందించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు కళా రాజేశ్వర్‌రావు, వేముల ప్రభాకర్, జేఎన్ శర్మ, సాధుల సురేష్, కుసుమ సుధాకర్, గూడూరు బాలాజీ పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై కేసు నమోదు

దామెర, ఏప్రిల్ 4: ఓగ్లాపూర్ శివారులో వ్యవసాయ భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ గురువారం తెలిపారు. హనుమకొండకు చెందిన శ్రీరామోజు సూర్యకళకు ఓగ్లాపూర్ సమీపంలోని సర్వే నంబర్లు 09, 110, 113, 114, 122లో 26 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని కొట్టాపాక రవి, అంబి సాంబయ్య, కండె నర్సయ్య, దండు భాస్కర్, గొలుసుల దేవేందర్, నాగ బెల్లి ఐలయ్య, అమ్మ సాంబయ్య, గాదెం జయక్క, కాశిపాక దుర్గయ్య, ఎడ్ల మంజుల ఆక్రమించి రోడ్డు కోసం కందకాలు తీయించారు. విషయం తెలుసుకున్న సూర్యకళ కుమారులు శ్రీరామోజు సుధీర్‌కుమార్, శిరీష్‌కుమార్, డ్రైవర్ ఖలీల్, రామ్మూర్తి భూమి వద్దకు వెళ్లగా ఆక్రమణదారులు బెదిరించారు. శ్రీరామోజు సుధీర్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన ఇంటర్ స్పాట్

10 రోజుల్లో ఫలితాలు ప్రకటించే అవకాశం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4: ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రశాంతంగా ముగిసిందని క్యాంపు అధికారి గోపాల్ తెలిపారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 4 వరకు ప్రక్రియ కొనసాగిందని, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 7.50 లక్షల పేపర్లు జిల్లాకేంద్రానికి వచ్చినట్లు చెప్పారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వీటిని దిద్దడానికి ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 361(సీఈలు), 1838(ఏఈ), స్కూటినైజర్లు(361) మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా స్పాట్ నిర్వహించినట్లు చెప్పారు. 10 రోజుల్లో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

వరంగల్, ఏప్రిల్ 4: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. గురువారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్‌పర్సన్లతో డిప్యూటీ కమిషనర్ రవీందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించాలని, మే నెల చివరి వరకు అన్ని పాఠశాలల్లో టాయ్‌లెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులకు యూనిఫాం అందించేందుకు ఇప్పటి నుంచే కొలతలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. బాలికలకు

సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి, ఈఈ రాజయ్య, డీఎంసీ రజితారాణి, సెక్టార్ అధికారి రాధ, ఎంఈవో రాంకిషన్‌రాజు, టీఎంసీ రమేశ్, డీఈలు శివానంద్, ఆజ్మీరా శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం స్వీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రేటర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఏఈలు హరికుమార్, విజయలక్ష్మి, శ్రీకాంత్, మేనక, వెంకటేశ్వర్లు, రామన్న పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

రంజిత్‌కుమార్ (ఫైల్)

కాశీబుగ్గ, ఏప్రిల్ 2: ఎనుమాముల పరిధిలోని ముసలమ్మ కుంటలో పడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 12వ డివిజన్ ఎంహెచ్ నగర్ చెందిన ఇద్దరు యువకులు మేస్త్రీ పని చేసి సాయంత్రం సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొడుతున్న సమయంలో దుప్పటి రంజిత్‌కుమార్(28) ప్రమాదవశాత్తు కుంటలో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎనుమాముల పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అప్పగించిన పోలీసులు

చెన్నారావుపేట, ఏప్రిల్ 3: మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి గణేశ్ ఈ నెల ఒకటిన తప్పిపోయినట్లు తల్లిదండ్రులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలుడి ఆచూకీ కనుగొని గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్ట్

శాయంపేట ఏప్రిల్ 4: ప్రేమ పేరుతో బాలికను వేధించిన యువకుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఎస్సై ప్రమోద్ కథనం ప్రకారం.. కొప్పుల గ్రామానికి చెందిన మైనర్‌ను అదే గ్రామానికి చెందిన పసుల శివరాజ్ నెల రోజులుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ నెల 2న రాత్రి బాధితురాలు కిరాణా షాపునకు వెళ్లి వస్తుండగా శివరాజ్ వేధించాడు. బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి శివరాజ్ అలియాస్ సుదర్శన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

భూమి పూజలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి

'మందిర్' నిర్మాణ పనులు ప్రారంభం

శాయంపేట ఏప్రిల్ 4: మండలకేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద షిర్డీ సాయిబాబా సత్సంగ్ మందిర్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరయ్యారు. ఎంపీటీసీ బాసాని చంద్ర ప్రకాశ్, సత్సంగ్ మందిర్ ట్రస్ట్ నిర్వాహకులు కందకట్ల రవి, సామల రవీందర్, కంబత్తుల ప్రకాశ్ పాల్గొన్నారు.

కోమటికుంట కట్ట ఎత్తును తగ్గించొద్దు

ఐనవోలు, ఏప్రిల్ 4: కోమటికుంట ఎత్తును తగ్గించడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందని రైతులు ఎండీ రఫీ, పోశాల శ్రీనివాస్, సాగర్, బొల్లెపల్లి ఎల్లయ్య, రాజయ్య, యాకాంతం అవేదనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. మండలంలోని ఐనవోలు నుంచి రాంనగర్ గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ మార్గం మధ్యలో ఐనవోలు శివారులో కోమటికుంట ఉంది. రోడ్డు పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ కట్ట ఎత్తును తగ్గించినట్లు రైతులు ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'స్కూళ్ల మరమ్మతు పూర్తి కావాలి'

ఖిలావరంగల్, ఏప్రిల్ 4: వేసవి సెలవులు ముగిసేలోగా పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనపై ఆమె సమీక్షించారు. జిల్లాలోని 645 పాఠశాలల్లో 602లో ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఆర్వీవో కౌసల్యాదేవి, డీఈవో వాసంతి తదితరులు పాల్గొన్నారు. అలాగే, జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన మల్లారెడ్డిపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థిని జనగాం కావ్యశ్రీని కలెక్టర్ అభినందించారు.

దొంగల ముఠా అరెస్టు

గీసుగొండ, ఏప్రిల్ 5 : దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు. మార్చి 21న 15వ డివిజన్ గొర్రెకుంట శివారు వంద ఫీట్లరోడ్డులోని కిరాణాషాపులో దొంగతనం చేసి, యజమాని ఇంట్లో ఉన్న లాకర్ పగులగొట్టి బంగారం, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. యజమాని మండల గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, దొంగతనాలకు పాల్పడుతున్న భూక్యా వంశీ, ఆవునూరి సాయితేజ, కాకటేటి శ్యామ్, మరో మైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. గతంలో గీసుగొండ, మిల్స్‌కాలనీ, ముమ్మునూరు పరిధిలోని గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

చెన్నారావుపేట, ఏప్రిల్ 4: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన దొంతి రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రవికుమార్‌తో కలిసి నర్సంపేటలోని శ్రీగురుకులంలో 2008లో పదో తరగతి చదివిన మిత్రులు రూ. 1.25 లక్షలు సేకరించి మృతుడి కుమార్తె అద్విక‌రెడ్డి పేరున రూ. లక్ష ఫిక్స్‌డ్ చేశారు. మిగిలిన రూ. 25 వేలను రవికుమార్ తల్లి భాగ్యమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్నారై నరేశ్, సుమన్, నాగరాజు, త్రిలోక్, అర్చన, రజినీకర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి కుటుంబానికి పెద్ది పరామర్శ

మమత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్, ఏప్రిల్ 4: తెలంగాణ ఉద్యమకారుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. కమ్మపల్లికి చెందిన ఉద్యమకారుడు, ప్రైవేటు లెక్చరర్ సాంబ రాతి మల్లేశం భార్య మమత(43) గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మమత మృతదేహానికి పెద్ది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మిట్టగడుపుల మల్లయ్య, మాజీ సర్పంచ్ వల్గుబెల్లి రంగారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి చిలువేరు శ్రీనివాస్, సీనియర్ నాయకులు కోమాండ్ల గోపాల్‌రెడ్డి, వల్గుబెల్లి ప్రతాప్‌రెడ్డి, తడిగొప్పుల మల్లేశం, చిరంజీవి ఉన్నారు.

జర్నలిస్టుల ముసుగులో వసూళ్ల పర్వం

■ **ఆలస్యంగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులతో బేరసారాలు**

■ **పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు?**

రాయపర్తి, ఏప్రిల్ 4: జర్నలిస్టుల ముసుగులో వసూళ్ల పర్వానికి తెరతీసిన ఇద్దరిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఆ ఇద్దరు ఆన్‌లైన్, పీడీఎఫ్ పత్రికలు, యూట్యూబ్ చానెళ్ల పేరుతో మండలంలోని గ్రామాల్లో సంచరిస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు మండలంలో చర్చ సాగుతున్నది. ప్రజలతోపాటు ఉద్యోగులను తిప్పలు పెడుతున్నట్లు సమాచారం. కాగా, ఈ నెల 1న కొలన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన హెచ్ఎం, ఉపాధ్యాయులు పాఠశాల సమయానికి 15 నిమిషాలు ఆలస్యంగా వచ్చినట్లు తెలిసింది. ఇదే అదునుగా భావించిన వసూల్ రాజాలు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులతో బేరసారాలకు దిగినట్లు సమాచారం. వారితో విసిగివేసారిన ఉపాధ్యాయులు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించడంతోపాటు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై వడ్డే సందీప్‌కుమార్ స్పందించారు. మండలంలో జరుగుతున్న ఘటనలపై నిఘా పెట్టడంతోపాటు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయానికి పంచలోహ విగ్రహాల బహూకరణ

దాతలను సన్మానిస్తున్న ఆలయ ట్రస్టు సభ్యులు

ఖిలావరంగల్, ఏప్రిల్ 4: శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవస్థానానికి స్థానిక వ్యాపారవేత్త వొడ్నాల మల్లయ్య కుటుంబ సభ్యులు గురువారం శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి పంచలోహ విగ్రహాలతో పాటు ఏసీని బహూకరించారు. ఉత్సవమూర్తులకు పూజారులు అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు వొడ్నాల మల్లయ్య, వొడ్నాల సదానందం, వొడ్నాల నరేందర్, వొడ్నాల రాజు దంపతులను ఆలయ కమిటీ సన్మానించింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మంచాల కృష్ణమూర్తి, కోశాధికారి చింతం యాదగిరి, సహాయ కార్యదర్శులు బుధారపు భాస్కర్, ఆడెపు సామ్మూర్తి, ఆర్గనైజర్లు కొండి రాజమౌళి, శ్రీరాం రాజేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

■ **నిర్లక్ష్యం వహిస్తే మిల్లర్లపై చర్యలు** ■ **సమీక్షలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి**

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 4: గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాన్ని రైస్ మిల్లర్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సీఎంఆర్‌పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు సీఎంఆర్ లక్ష్యం ఎంత పూర్తి చేశారు.. మిగతాది ఎప్పటి వరకు పూర్తి చేస్తారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయడంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. సమావేశంలో డీసీఎస్‌వో వసంతలక్ష్మి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మహేందర్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్లు కృష్ణ, రోజారాణి, రమేశ్, సత్యనారాయణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, జగన్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు జాబితా అందజేత..

ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 43,483 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాసరావు, విద్యాసాగర్, రావు అమరేందర్‌రెడ్డి, మణి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

■ **సభ్యుల కోరం లేని ఫలితం**

జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, సీఈవో రాంరెడ్డి, అధికారులు

వరంగల్, ఏప్రిల్ 4 (నమస్తేతెలంగాణ) : సభ్యుల కోరం లేకపోవడం వల్ల వరంగల్ జడ్పీ పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ముందుగా ప్రకటించినట్లు జడ్పీ సర్వ సభ్య సమావేశం నిర్వహణకు గురువారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, సీఈవో రాంరెడ్డితో పాటు అధికారులు సమావేశ మందిరానికి చేరుకున్నారు. జడ్పీటీసీలు, ఎంపీపీల్లో వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతి, గీసుగొండ ఎంపీపీ బీ సౌజన్య మాత్రమే హాజరయ్యారు. పదహారేసి జడ్పీటీసీలు, ఎంపీపీలకు గాను ఒక జడ్పీటీసీ, ఒక ఎంపీపీ మాత్రమే హాజరయ్యారు. కొద్దిసేపు వేచి చూసిన తర్వాత కోరం లేనందువల్ల సర్వ సభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి ప్రకటించారు. దీంతో అప్పటికే సమావేశానికి చేరుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లిపోయారు. ఇటీవల పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడడం, జడ్పీటీసీలు, ఎంపీపీలు ఎన్నికల ప్రచారం బిజీగా ఉండడం వల్ల మెజారిటీ జడ్పీటీసీలు, ఎంపీపీలు సమావేశానికి హాజరు కానట్లు అధికారులు తెలిపారు. వాయిదా పడిన జడ్పీ సర్వ సభ్య సమావేశం మే 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరిగిన తర్వాత నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఎస్ఆర్ఆర్ తోటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

కరీమాబాద్, ఏప్రిల్ 4: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఎస్ఆర్ఆర్ తోటలో చేపట్టిన బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. గురువారం దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

ఐనవోలు, ఏప్రిల్ 4: బెల్ట్ షాపుపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంథిని గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడు పుల్లూరి మల్లికార్జున్ నుంచి రూ. 3800 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

43 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

పరకాల, ఏప్రిల్ 4: టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు రూ. 10.75 లక్షల విలువైన 43 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు కథనం ప్రకారం.. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ సెంటర్ వద్ద టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో ఎండు గంజాయి గుర్తించారు. కారును స్వాధీనం చేసుకుని, ముంబైకి చెందిన శుభంపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఒడిశా బార్డర్ నుంచి ముంబైకి గంజాయిని తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. కార్యక్రమంలో సీఐలు తాతాజీ, నాగేశ్వర్ రావు, ఎస్సైలు రజితారెడ్డి, సులోచన పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

పిల్లలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేశ్

హనుమకొండ, ఏప్రిల్ 4: అంతర్జాతీయ స్థాయిలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన సీనాప్స్ ఒలింపియాడ్ పోటీ పర